క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న శిద్దా దంపతులు



ఒంగోలు: ముక్కోటి పర్వదినాన మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు దంపతులు, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు శిద్దా సుధీర్‌కుమార్‌లు, కుటుంబ సభ్యులతో కలిసి ఉత్తర ద్వార దర్శనం ద్వారా శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో వీరు స్వామిని దర్శించుకున్నారు. టీటీడీ అధికారులు, అర్చకులు శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్‌కుమార్‌కి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో మల్లవరం వెంకటేశ్వరస్వామి



మల్లవరంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు

మద్దిపాడు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని అన్ని వైష్ణవాలయాల్లో శనివారం ఉదయం నుంచి స్వామివారు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. మల్లవరంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు నారాయణం వెంకటాచార్యులు రాజశేఖరాచార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేయగా, స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయమే భక్తులు స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులుతీరారు. ఉత్తర ద్వార దర్శనం తర్వాత భక్తులు ఆలయంలోకి ప్రవేశించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. వెంకటేశ్వర స్వామి భక్త బృందం ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదాలు అందించారు. ఆలయ పరిధిలో ఉన్న కల్యాణ మండపంలో ఆలయ కమిటీ చైర్మన్, ఈఓలు భక్తులకు ఉదయం ఫలహారం, మధ్యాహ్నం అన్న ప్రసాదాలు పంపిణీ చేయించారు. పలువురు భక్తులు స్వామి వారికి కానుకలు సమర్పించుకున్నారు. ఉదయం నుంచే భారీ సంఖ్యలో భక్తులు చేరడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మద్దిపాడు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి రద్దీని నివారించారు.

సంతనూతలపాడు మండలంలో...

చీమకుర్తి: వైకుంఠ ముక్కోటి ఏకాదశి వేడుకలను శనివారం సంతనూతలపాడు మండలం మైనంపాడు, సంతనూతలపాడులో స్థానిక భక్తులు వైభవంగా నిర్వహించారు. మైనంపాడులోని శ్రీరాములవారి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనంలో భక్తులు పాల్గొన్నారు. గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

కొత్తపట్నం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఆదికేశవ స్వామి, రాజుగోపాలస్వామి, సాయిబాబా, నాగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు భారీగా స్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నీలంపాయిూత్, డివిజన్ నాయకులు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు పాత మార్కెట్ సెంటర్‌లో నీలంపాలెం యూత్ ఆధ్వర్యంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆర్సీఎం చర్చి ఫాదర్ డీఎస్ పాల్ ముఖ్య అతిథిగా పాల్గొని దైవ సందేశాన్ని అందించారు. 46వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పర్ల విజయభాస్కర్, దేవర పల్లి రమణయ్య, ముత్తన సుగుణమ్మ, గడ్డం నరేష్ తదితరులు పాల్గొని చిన్నారులకు బహుమతులు అందించారు. క్రీస్తు జననం నాటికను ప్రదర్శించారు. నీలంపాటి యూత్ అధ్యక్షుడు దేవరపల్ల సాయి చరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు: స్థానిక ధారావారాతోటలోని నారాయణ ఒలంపిక్ స్కూలులో, సెమీ క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాంనగర్‌లోని 8వ లైనులోని బీఆర్ ఒలంపియాడ్ స్కూలులో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీస్తు జననానికి సంబంధించిన నాటికను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ కె.దిలీప్‌కుమార్ రెడ్డి, డాక్టర్ ఎం రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. సంతపేటలోని నారాయణ ఈ టెక్నో స్కూలులో, నారాయణ సీవో అండ్ ఒలంపియాడ్ స్కూల్లో నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఏజీఎం పెద్దిరెడ్డి, క్లస్టర్ ప్రిన్సిపాల్ వేదవతి హాజరయ్యారు.

ఏపీ టీచర్స్ గిల్డ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ఒంగోలు: ఏపీ టీచర్స్ గిల్డ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఉదయ్‌భాస్కర్ శనివారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, కార్యాలయ సిబ్బంది సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తారని ఆశిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్లలో పనిచేసే ఏపీటీజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

చీమకుర్తి: పేర్నమిట్ట జిల్లాపరిషత్ హైస్కూల్లోని 8వ తరగతి విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ ఈశ్వరరావు చేతుల మీదుగా శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పార్వతీకాంతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నూకతోటి కోటేశ్వరరావు, స్థానిక నాయకులు, టీచర్లు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాల్లో బందోబస్తుకు చర్యలు



వివిధ రాజకీయ పార్టీలతో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

ఒంగోలు టౌన్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రానున్న ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఆర్డీఓ యు.విశ్వేశ్వరరావు చెప్పారు. ఆర్డీఓ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రెవెన్యూ డివిజన్ పరిధిలో చెక్ పోస్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటుకు పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షిస్తామన్నారు. నియోజకవర్గంలోని 259 పోలింగ్‌స్టేషన్ల పరిధిలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఫారం 6 ద్వారా కొత్త ఓట్లు చేరే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా తమకు రెండు చోట్ల ఓట్లు లేవని డిక్లరేషన్ ఇవ్వాలని చెప్పారు. అలాగే ఫారం 7 ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిశీలన చివరి దశకు వచ్చిందన్నారు. అభ్యంతరాల పరిశీలను ఈనెల 26 వరకు గడువు ఉందని తెలిపారు. ఒంగోలు తహసీల్దార్ మురళి, వైఎస్సార్ సీపీ నాయకుడు దామరాజు క్రాంతికుమార్, టీడీపీ నాయకుడు స్వరూప్, కాంగ్రెస్ తరఫున రసూల్, బీజేపీ తరుపున బసినేపల్లి రాజశేఖర్, గుర్రం సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు భేష్



మాట్లాడుతున్న డ్వామా పీడీ శీనారెడ్డి, పాల్గొన్న ఎంపీపీ అరుణ, అధికారులు

మద్దిపాడు: మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు భేష్ అని డ్వామా పీడీ శీనారెడ్డి అభినందించారు. మండలంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా జరిగిన పనులపై సోషల్ ఆడిట్‌ను పబ్లిక్ ఫోరం ఏపీఓ ధనంజయవర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీడీ.. పనులు సక్రమంగా నిర్వహించడంపై ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సోషల్ ఆడిట్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పలువురు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు అన్ని ఏర్పాట్లు

కొత్తపట్నం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత తెలిపారు. అల్లూరు హైస్కూల్‌లో ఉన్న గ్రౌండ్ను వారు పరిశీలించారు.

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి అల్లూరులో గ్రౌండ్ ఏర్పాటు చేశారని తెలిపారు. రెండు సచివాలయాల్లో ఉన్న ఆటల కిట్లను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, హిమబిందు, వీఆర్వో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.